APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com
తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి    ఎడిటర్ : సి హరికృష్ణ    శుక్రవారం 14 ఆగస్టు 2026    సంపుటి: 01    సంచిక :79    పేజీలు : 04    వెల: 2-00/-

## జనసేనలోకి రాజాసింగ్..?



హైదరాబాద్ , ఆగస్టు 14: హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారాయి. కొత్త సమీకరణాలు తెర మీదకు వస్తున్నాయి. త్వరలో జరగనున్న గ్రేటర్ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. జనసేన సైతం గ్రేటర్ లో పోటీకి డిసైడ్ అయింది. బీజేపీ తమకు పొత్తు ఎవరి తో ఉండదని.. సింగిల్ గానే పోటీ చేస్తామని ప్రకటించింది. ఇదే సమయంలో ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఆయన అడుగులు ఏంటనేది స్పష్టత వస్తోంది. ఇక్కడే అసలు లెక్కలు మొదలయ్యాయి. హైదరాబాద్ కేంద్రంగా రాజకీయం వేడెక్కుతోంది. సీఎం రేవంత్ గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పథకాల అమలు పైన ఫోకస్ చేసారు. కొత్త నిర్ణయాల అమలు దిశ గా కార్యాచరణ ఖరారు చేస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ గ్రేటర్ పరిధిలో తమ బలం మరో సారి చాటాలని భావిస్తోంది. బీజేపీ సైతం హైదరాబాద్ లో తమకు తిరుగు లేదని చెబుతోంది. ఈ సమయంలోనే జనసేనాని పవన్ తాము వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ఇటు బీజేపీ మాత్రం తమకు జనసేనతో పొత్తు ఉండదని తేల్చి చెప్పింది. జనసేన కేడర్ గ్రేటర్ ఎన్నికల కోసం కసరత్తు మొదలు పెట్టింది. కాగా, ఎమ్మెల్యే రాజాసింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. జనసేన రాబోయే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాల్లో పోటీ చేయాలని సూచించారు. దీనికి కొనసాగింపుగా పవన్ కల్యాణ్ నాయకత్వంలో తెలంగాణలోనూ జనసేన బలపడితే భవిష్యత్తులో ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కూడా ఉంటుందని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త లెక్కలకు కారణమవుతున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగి పోయారని, ప్రత్యామ్నాయం (మిగతా 2వ పేజీలో)




## రాజధాని పనుల్లో కీలక మైలురాయి..

అమరావతి, ఆగస్టు 14: అమరావతి రాజధాని ప్రయాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని నగర అనుసంధానానికి అత్యంత కీలకమైన E3 సీడ్ యాక్సెస్ రోడ్డు'లో మేజర్ స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. దీంతో రాజధాని అమరావతి పనులు మరింత వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, రాజధాని మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని చెబుతున్నారు. ఇందులో భాగంగా రాజధానిని విజయవాడ, గుంటూరు నగరాలకు అనుసంధానించే సీడ్ యాక్సెస్ రోడ్డును త్వరతగతిన పూర్తి చేయడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చిందని చెబుతున్నారు.రాజధాని నగర అనుసంధానానికి అత్యంత కీలకమైన 'ఈ3 సీడ్ యాక్సెస్ రోడ్డు'లో మేజర్ స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించారు. 'ఈ3 సీడ్ యాక్సెస్ రోడ్డు' అనేది కేవలం ఒక సాధారణ రోడ్డు మాత్రమే కాకుండా, అమరావతి భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా రూపొందించిన ఒక వ్యూహాత్మక కనెక్టివిటీ కారిడార్ అంటున్నారు. దొండపాడు నుండి రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి మీదుగా తాడేపల్లి వరకు సుమారు 21.77 కి.మీ పొడవైన సబ్-ఆర్టీరియల్ రోడ్డు మణిపాల్ హాస్పిటల్స్ వద్ద జాతీయ రహదారి-16తో అనుసంధానమవుతుంది. ఈ కారిడార్ పొడవునా 60 మీటర్ల రైట్-ఆఫ్-వే కేటాయించారు. భవిష్యత్తులో పెరిగే ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్లాన్ చేసిన దీర్ఘకాలిక ప్రణాళికకు నిదర్శనంగా నిలుస్తుందని అంటున్నారు. కేవలం రోడ్డు మాత్రమే కాకుండా, బీఆర్టీఎస్, సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు గ్రీన్ బెల్టులతో కూడిన ఒక సమగ్ర రవాణా వ్యవస్థగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. సాధారణంగా పెద్ద ప్రాజెక్టులు పూర్తి (మిగతా 2వ పేజీలో)



## ఏకంగా 5 కీలక బిల్లులు బంద్!

### ప్రతిపక్షాల వ్యూహాత్మక దెబ్బ..

ఢిల్లీ, ఆగస్టు 14: నేటితో ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు భారత రాజకీయంలో ఒక కొత్త చర్చకు తెరలేపాయి. జులై 20న సమావేశాలు ప్రారంభమైన సమయానికి, బెంగాల్ ఎన్నికల ఫలితాలు , వివిధ పార్టీల ఎంపీల చేరికతో అధికార ఎన్డీఏ కూటమి పూర్తి ఆధిక్యంలో కనిపించింది. ప్రతిపక్షాలు తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం సభలో సులభంగానే తన అజెండాను నెరవేర్చుకుంటుందని విశ్లేషకులు భావించారు. కానీ, సభ ముగిసే సమయానికి సీన్ పూర్తిగా తిరగబడింది. విద్యార్థుల ఉద్యమం ఇచ్చిన మైలేజీని వ్యూహాత్మకంగా వాడుకున్న విపక్షాలు, పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని గట్టి డిఫెన్స్‌లో పడేశాయి. ఈ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ముందుకు తెచ్చిన అనేక బిల్లులు ప్రతిపక్షాల ఆందోళనల హోరులో కొట్టుకుపోయాయి. దేశ రాజకీయ చిత్రాన్ని మార్చే నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు.. 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్ బిల్లు, అరెస్ట్ అయిన ప్రజాప్రతినిధుల తొలగింపు బిల్లులు ఆమోదం పొందలేకపోయాయి. ముఖ్యంగా డెలిమిటేషన్ విషయంలో డీఎంకే మద్దతు కూడగట్టాలని కేంద్రం భావించినప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వంలో విపక్షాలు అమలు చేసిన పక్కా వ్యూహంతో ప్రాంతీయ పార్టీలేవీ ఎన్డీఏ వైపు మొగ్గు చూపలేకపోయాయి. ఫలితంగా లోక్‌సభ పర్ఫామెన్స్ కేవలం 19 శాతానికి, రాజ్యసభ 39 శాతానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' పిలుపు ఈ సమావేశాలకు ప్రధాన (మిగతా 2వ పేజీలో)



## సరికొత్త డ్రోన్ ప్లాన్!

### ఏకంగా వెయ్యి కిలోమీటర్ల దూరం వెళ్లి చంపేస్తాయ్

ఢిల్లీ, ఆగస్టు 14: భారత నావికాదళం సముద్రంలో తన సార్వభౌమత్వాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు సరికొత్త రక్షణ వ్యూహాలకు పదును పెడుతోంది. ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్ల పాత్ర ఎంత కీలకమో ఎర్రసముద్రంలో జరుగుతున్న పరిణామాలు ప్రపంచ దేశాలకు స్పష్టంగా చూపించాయి. ఈ నేపథ్యంలో శత్రువు ఊహించని రీతిలో, సముద్రం మీది యుద్ధనౌకల నుంచే ఏకంగా 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఖచ్చితత్వంతో ధ్వంసం చేసే సామర్థ్యం ఉన్న ఆత్మాహుతి డ్రోన్ల కొనుగోలుకు భారత నేవీ రంగం సిద్ధం చేస్తోంది. శత్రుదేశాల తీరప్రాంత క్షిపణి వ్యవస్థల కంటికి చిక్కకుండా, మన యుద్ధనౌకలు సురక్షిత దూరంలో ఉంటూనే వ్యూహాత్మక దాడులు చేయడానికి ఈ సాంకేతికత అద్భుతంగా తోడ్పడనుంది. ఈ ప్రత్యేక డ్రోన్లు గాల్లోకి ఎగిరిన తర్వాత దాదాపు 9 గంటల పాటు నిరంతరాయంగా పహారా కాయగలవు. శత్రువు స్థావరాన్ని గుర్తించగానే గంటకు 200 నాట్ల వేగంతో విరుచుకుపడతాయి. పగటితో పాటు చీకట్లోనూ ఖచ్చితమైన లక్ష్యాలను గుర్తించేలా ఎలక్ట్రో-ఆప్టికల్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లను వీటిలో అమర్చనున్నారు. సర్క్యులర్ ఎర్రర్ ప్రాబబుల్ అనుకున్న టార్గెట్‌ను నేలమట్టం చేసే అద్భుతమైన సామర్థ్యం వీటి సొంతం. అంతేకాదు, శత్రువులు ఒకవేళ శాటిలైట్ సిగ్నళ్లను జామింగ్ చేసినా తమ పనిని విజయవంతంగా ముగించే అధునాతన నావిగేషన్ ఫీచర్లు ఇందులో ఉండనున్నాయి. ఈ (మిగతా 2వ పేజీలో)

## తెలుగు వాళ్లే టార్గెట్..

## మన అమ్మాయిలే అస్త్రాలు..

### ఢిల్లీ కేంద్రంగా పెట్రేగిపోయిన సైబర్ ముఠా

ఢిల్లీ, ఆగస్టు 14: తెలుగు రాష్ట్రాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని, రుణాల పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా భారీస్థాయిలో కాల్ సెంటర్ నిర్వహిస్తూ ఈ ముఠా మోసాలకు పాల్పడుతోంది. బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఢిల్లీలో కాల్ సెంటర్ ను గుర్తించడమే కాక్కుండా, అందులో పనిచేస్తున్న 21 మంది తెలుగు యువతులను అరెస్ట్ చేశారని కథనాలు వస్తున్నాయి. ఈ ముఠా గత 18 నెలలుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. రుణాలు ఇప్పిస్తామని ఆశపెట్టి ఫోన్ ద్వారా అమాయకుల నుంచి డబ్బు కొల్లగొడుతున్న ముఠాలో అసలు సూత్రధారులు ఇంకా దొరకాల్సివుందని పోలీసులు చెబుతున్నారు. ఢిల్లీ కేంద్రంగా సైబర్ ముఠా అరాచకాలకు పాల్పడుతోందని గుర్తించిన పోలీసులు ఆకస్మిక దాడులు చేసి నిందితులను అరెస్టు చేశారని చెబుతున్నారు. కాల్ సెంటర్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ఫోన్ కాల్స్ చేసేవారని, తాము ప్రముఖ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులమని నమ్మబలికి, అతి తక్కువ వడ్డీతోపాటు ఎటువంటి గ్యారెంటీలు లేకుండానే రుణాలు ఇస్తామని ఆశ చూపే వారని పోలీసులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలతో సులభంగా మమేకం అవ్వడానికి ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులను టెలీకాలర్లుగా నియమించుకోవడం ద్వారా ఈ ముఠా పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని అంటున్నారు.ఒకసారి బాధితులు వలలో పడిన తర్వాత, నిందితుల్ల అసలు రూపం బయటపడేదని పోలీసులు చెబుతున్నారు. లోన్ ప్రాసెసింగ్ ఫీజులు, డాక్యుమెంటేషన్, వెరిఫికేషన్ ఛార్జీలు, ఇన్సూరెన్స్ పేరిట బాధితుల న్నుంచి వేల రూపాయలను ఆన్‌లైన్ ద్వారా వసూలు చేసేవారని, ఆ తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయడం మానేసేవారని పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఎవరైనా బాధితులు డబ్బులు చెల్లించిన తర్వాత లోన్ రాలేదని నిలదీస్తే, వారిని బెదిరింపులకు గురిచేసేవారని కూడా చెబుతున్నారు. ఈ ముఠా బాధితులను మానసికంగా ఆర్థికంగా వేధించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ~శ్రీంశీ =ఖుం - మాజీ మావోయిస్టుల రాంప్ వాక్. వీడియోలు వైరల్ తెలంగాణలో నమోదైన సుమారు 22 సైబర్ క్రైమ్ కేసుల ఆధారంగా రంగంలోకి దిగిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు సాంకేతిక ఆధారాలను విశ్లేషించి ఈ ముఠా డెన్ ను గుర్తించారని చెబుతున్నారు. ఢిల్లీలోని కాల్ సెంటర్ పై దాడులు నిర్వహించిన అధికారులు, అక్కడ పనిచేస్తున్న 20 నుండి 40 ఏళ్ల మధ్య వయస్సు గల 21 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. సోదాల సమయంలో భారీగా మొబైల్ ఫోన్లు బ్యాంక్ పాస్‌బుక్స్‌లు, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ మోసాలకు సూత్రధారులైన ప్రధాన నిందితులు ఇంకా పరారీలోనే ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కాల్ సెంటర్ల నిర్వహణ, నిధుల మళ్లింపు వంటి కీలక వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అసలైన నేరగాళ్లను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. ఈ ముఠా సేకరించిన నగదు హవాలా మార్గాల ద్వారా ఎక్కడికి వెళ్తుందనే దానిపై కూడా దర్యాప్తు జరుగుతోందని చెబుతున్నారు. ఈ ఘటన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు అప్రమత్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ లో వచ్చే ఆకర్షణీయమైన రుణాల ఆఫర్లను గుడ్డిగా నమ్మవద్దని, ఏదైనా సంస్థ పేరు చెప్పి కాల్స్ వస్తే, ఆ సంస్థ ప్రామాణికతను అధికారిక వెబ్ సైట్ల ద్వారా మాత్రమే ధృవీకరించుకోవాలని సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఓటీపీల (న్యూ), లేదా వ్యక్తిగత డాక్యుమెంట్లు పంపవద్దని హెచ్చరిస్తున్నారు.



# ఏకంగా 5 కీలక బిల్లులు బంద్!

(మొదటి పేజీ తరువాయి)

మలుపుగా మారింది. నిరసన తెలుపుతున్న అహింసయుత విద్యార్థులపై పోలీసులు పెల్లెట్ తుపాకులు వాడారనే ఆరోపణలను ప్రతిపక్షాలు అస్త్రంగా మలచుకున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధితులైన విద్యార్థులను కలవడం, ప్రధాని నివాసం వద్ద అనూహ్య ధర్నాకు దిగడం వంటి చర్యలతో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. ఈ నిరసనల ఒత్తిడి ఏ స్థాయిలో ఉందంటే.. ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. విద్యార్థులపై పోలీసుల ప్రవర్తనపై హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి. గత బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలపై విరుచుకుపడిన అమిత్ షా, ఈ సమావేశాల్లో మాత్రం విపక్షాల నిరసనల నడుమ చివరి రోజు మాత్రమే లోక్‌సభలో స్వల్ప సమయం కనిపించడం గమనార్హం. సభ ముగింపు సందర్భంగా స్పీకర్ ఇచ్చే సాంప్రదాయ తేనీటి విందుకు కూడా "హోంమంత్రి ఉంటే మేము రాము" అని కాంగ్రెస్ తెగేసి చెప్పడం.. ప్రభుత్వం , విపక్షాల మధ్య పెరిగిన తీవ్రమైన వైరాన్ని స్పష్టం చేస్తోంది. ఏకపక్షంగా సాగుతుందనుకున్న వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షం తీవ్రమైన ప్రతిఘటనను ఎదురొడ్డి నిలిపింది. ప్రజా సమస్యలను, విద్యార్థుల ఆక్రోశాన్ని పార్లమెంట్ అజెండాగా మార్చడంలో విపక్షాలు సాధించిన ఈ విజయం.. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్‌లోనూ, బయట కూడా మరిన్ని సవాళ్లు విసిరే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# రాజధాని పనుల్లో కీలక మైలురాయి..

(మొదటి పేజీ తరువాయి)

కావడానికి సంవత్సరాల సమయం పడుతుంది, కానీ ప్రభుత్వం ఇక్కడ వినూత్నమైన 'ఫేజ్డ్ అప్రోచ్' విధానాన్ని అనుసరిస్తోంది. పూర్తిస్థాయి ఈ3 కారిడార్ (దశ-3) 2028 నాటికి పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, ప్రజలకు ఇప్పుడే ప్రయోజనం కలగాలనే లక్ష్యంతో మేజర్ స్టీల్ బ్రిడ్జిని అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల విజయవాడ-మంగళగిరి ఓల్డ్ హైవేకి డైవర్షన్ లింక్ ఏర్పడి, అమరావతికి రాకపోకలు సులభతరమయ్యాయి. సుమారు రూ.1,600 కోట్ల భారీ వ్యయంతో ఈ కారిడార్ రూపుదిద్దుకుంటోంది. ఏ పెద్ద ప్రాజెక్టుకైనా భూసేకరణ అనేది ఒక అతిపెద్ద సవాలుగా మారుతుంది. ఈ కారిడార్ నిర్మాణంలో కూడా కొన్ని అడ్డంకులు ఎదురైనా, అమరావతి రైతులు అందించిన సహకారం వెలకట్టలేనిదని ముఖ్యమంత్రి కొనియాడారు. రైతులు, ప్రభుత్వం, ఇంజనీరింగ్ బృందాల సమన్వయంతోనే స్టీల్ బ్రిడ్జి సాకారం అయింది. ఇదే రోజు అమరావతిలో మరో అద్భుతమైన మైలురాయి ఆవిష్కృతమైంది. ఈ3 రోడ్డు ప్రారంభంతో పాటు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం అత్యంత ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన 18 నివాస టవర్లను కూడా సీఆర్డీఏకి బదిలీ చేస్తున్నారు. ప్రతి అపార్ట్‌మెంట్ 3,500 చదరపు అడుగుల వైశాల్యంతో, జిమ్, స్పా, మినీ-థియేటర్ వంటి అన్ని సౌకర్యాలతో కూడిన ఒక రెసిడెన్షియల్ కమ్యూనిటీగా వీటిని అభివృద్ధి చేశారు. మొత్తంగా చూస్తే, రోడ్లు రాజధానిని కలుపుతాయి, భవనాలు పరిపాలనను స్థిరపరుస్తాయని విశ్లేషిస్తున్నారు. ఈ మౌలిక వసతులు అమరావతిని కేవలం ఒక నగరంలా కాకుండా, భవిష్యత్తు తరాలకు గర్వకారణమైన ఆధునిక రాజధానిగా తీర్చిదిద్దే దిశగా వేసిన బలమైన అడుగులు. అమరావతి ఇప్పుడు కేవలం ఆకాంక్ష కాదు, అది క్షేత్రస్థాయిలో వేగంగా మారుతున్న వాస్తవంగా వ్యాఖ్యానిస్తున్నారు.

# సరికొత్త డ్రోన్ ప్లాన్!

(మొదటి పేజీ తరువాయి)

విప్లవాత్మక సాంకేతికత ద్వారా యుద్ధనౌకపై ఉన్న ఒక్క డిజిటల్ ఆపరేటర్ ఏకకాలంలో 10 డ్రోన్లను కంట్రోల్ చేసే వీలుంటుంది. అవసరాన్ని బట్టి ఈ డ్రోన్ల కంట్రోల్‌ను మరో నావికాదళ నౌకకు లేదా తీరంలో ఉన్న ల్యాండ్ స్టేషన్‌కు సులభంగా బదిలీ చేయవచ్చు. అత్యంత తీవ్రమైన గాలులు అంటే గంటకు 50 నాట్ల వేగంతో గాలి వీచినా, 95 శాతం తేమ ఉన్న కఠిన సముద్ర వాతావరణాన్ని తట్టుకుని ఇవి పనిచేస్తాయి. ఈ సిస్టమ్ యొక్క కీలక విడిభాగాలకు కనీసం 10 నుంచి 20 సంవత్సరాల జీవితకాల హామీ ఉండాలని రక్షణ శాఖ ప్రాథమిక నిబంధన విధించింది.

# జనసేనలోకి రాజాసింగ్..?

(మొదటి పేజీ తరువాయి)

కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనకు, ముఖ్యంగా యువతలో మంచి ఆదరణ ఉందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పవన్ పార్టీని రాష్ట్రంలో విస్తరించాలని కోరారు. రాష్ట్ర బీజేపీలో నిర్ణయాల పైన రాజాసింగ్ ఓపెన్ గానే తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. కాగా.. జనసేన లో తనకు కీలక బాధ్యతలు అప్పగిస్తే అందులో తన వంతు పాత్ర పోషించేందుకు రాజాసింగ్ సిద్దంగా ఉన్నాననే సంకేతాలు ఇస్తున్నట్లుగా విశ్లేషణ లు మొదలయ్యాయి. అయితే, బీజేపీతో ఏపీలో పొత్తులో కొనసాగుతున్న పవన్.. ఇప్పుడు రాజాసింగ్ ను పార్టీలో చేర్చుకునేందుకు అంగీకరిస్తారా అనేది సందేహంగానే కనిపిస్తోంది. దీంతో.. గ్రేటర్ ఎన్నికల్లో జనసేన పోటీ.. రాజాసింగ్ నిర్ణయం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తిని పెంచుతోంది.




# మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో తీవ్ర విషాదం!

హైదరాబాద్, ఆగస్టు 14: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది కేసీఆర్ బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు ఈరోజు ఉదయం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నేడు ఉదయం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కేసీఆర్ బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు మృతి కేసీఆర్ బావమరిది జోగినపల్లి శ్రీనివాసరావు మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. శ్రీనివాస్ రావు మృతదేహాన్ని సుచిత్రలోని ఆయన నివాసానికి తరలించారు. ఆయన కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఆయన రాక తర్వాతే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జోగినపల్లి శ్రీనివాస్ రావు కేటీఆర్‌కు మేనమామ. కేసీఆర్ సతీమణి శోభకు స్వయంగా సోదరుడు. మృతి వార్త విన్న వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు తమకు ఉన్న అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని సుచిత్రలోని జోగినపల్లి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లారు. ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు పలువురు నాయకులు కూడా అక్కడికి చేరుకుని నివాళులు అర్పించారు. జోగినపల్లి కుటుంబాన్ని పరామర్శించి, ఆవేదన చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా యశోద ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్ రావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ఈ లోటును తట్టుకునే శక్తిని ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేసినప్పుడు జోగినపల్లి శ్రీనివాస్ రావు అక్కడే ఉండి అన్ని వ్యవహారాలు చక్కబెట్టిన సంగతి తెలిసిందే. ఆయన మృతితో కేసీఆర్ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇటీవల కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందగా, ఇప్పుడు కేసీఆర్ బావమరిది జోగినపల్లి శ్రీనివాసరావు మృతి చెందారు.

# హైదరాబాద్ టు బెంగళూరు ప్రయాణీకులకు బిగ్ అప్డేట్..!!

హైదరాబాద్, ఆగస్టు 14: హైదరాబాద్- బెంగళూరు ప్రయాణీకులకు బిగ్ అప్డేట్. ఈ మార్గంలో ప్రయాణం ఇక మరింత సులభంగా.. వేగంగా వెళ్లేందుకు వీలుగా కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి విస్తరణకు ఆమోదం లభించింది. ప్రస్తుతమున్న 176.37 కిలోమీటర్ల 4 వరుసల రహదారిని 6 లేన్ల పాక్షిక యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. ఇందు కోసం దాదాపు రూ 5 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44) విస్తరణకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మార్గంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వరకు ప్రస్తుతమున్న 176.37 కిలోమీటర్ల 4 వరుస ల రహదారిని 6 లేన్ల పాక్షిక యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేలా అలైన్‌మెంట్‌ను రూపొందించి కేంద్రానికి పంపింది. రూ. 5 వేల కోట్ల ప్రాథమిక అంచనా వ్యయంతో బ్రౌన్ ఫీల్డ్ (ప్రస్తుత రోడ్డునే అభివృద్ధి, విస్తరణ చేయడం) విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. తెలంగాణ పరిధిలో ఈ మార్గం కొత్తూరు, షాద్‌నగర్, బాలానగర్, జడ్చర్ల, భూత్పూర్, అన్నాసాగర్, జానంపేట, మూసాపేట, అడ్డాకల్, కనిమెట్ల, బీచుపల్లి, పుల్లూర్ మీదుగా కర్నూలుకు చేరుకుంటుంది. ఈ మార్గంలో మొత్తం రహదారిపై 3 చోట్ల టోల్ ప్లాజాలు, 8 మేజర్, 62 మైనర్ జంక్షన్లతో పాటు 10 మేజర్, 74 మైనర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. మొత్తం 86 అండర్ పాస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ మార్గంలో ఏర్పాటు చేయబోయే 3 టోల్‌ప్లాజాల్లోనూ.. ప్రయాణించిన దూరం మాత్రమే రుసుము చెల్లించేలా కొత్త సాంకేతికతను వినియోగించనున్నారు. వాహనం హైవే పైకి ఎక్కిన



చోట, దిగిన చోట ఉండే ఆటోమేటిక్ స్కానర్లు ప్రయాణించిన దూరాన్ని లెక్కించి నేరుగా ఫాస్టాగ్ నుంచి రుసుమును మినహాయించుకుంటాయి. ప్రస్తుత రహదారిపై గంటకు 80 కిలో మీటర్ల వేగానికి అనుమతి ఉండగా.. విస్తరణ అనంతరం వాహనాలు గంటకు 100-120 కి.మీ వేగంతో ప్రయాణించేందుకు వీలవుతుంది. హైదరాబాద్- బెంగళూరు మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం 8-10 గంటల వరకు ఉండగా.. ఇక నుంచి 4 నుంచి 5 గంటల సమయంలో పూర్తి చేసే అవకాశం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

# ఏపీలో బీసీ రిజర్వేషన్లు, కీలక సిఫారసులు ..!!

ఆంధ్రప్రదేశ్, ఆగస్టు 14: ఏపీలో మరో కీలక నిర్ణయం దిశగా కసరత్తు జరుగుతోంది. బీసీ రిజర్వేషన్ల పైన ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ కీలక సిఫారసులు చేసినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు పై చేసిన ప్రతిపాదనల్లో స్థానిక జనాభా ప్రకారం రిజర్వేషన్ల అమలు చేసేందుకు వీలుగా ఈ సిఫార్సులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సిఫారసుల పైన మంత్రివర్గ ఉప సంఘం చర్చించి.. ప్రభుత్వానికి తమ నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగా రిజర్వేషన్ల పైన నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది. బీసీ రిజర్వేషన్ల పైన ప్రభుత్వం నియమించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ప్రత్యేక కమిషన్ ప్రభుత్వానికి కీలక ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తోంది. ఈ కమిషన్ ఇచ్చిన నివేదిక మేరకు స్థానిక ఎన్నికల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో స్థానిక బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లను అమలు చేసే విధంగా ప్రతిపాదనలు చేసారని సమాచారం. బీసీ రిజర్వేషన్ల అమలు వేళ ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ఎలాంటి ఆటంకం కలగకుండా కీలక సూచనలు అందించినట్లు తెలుస్తోంది. ఈ కమిషన్ దాదాపు ఏడు నెలల పాటు కసరత్తు కొనసాగించింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితి మించకుండా బీసీలకు ప్రయోజనం చేకూర్చే ముఖ్యమైన ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి



వెనుకబడిన తరగతుల జనాభాను నిర్ధారించడానికి కమిషన్ ఏకీకృత కుటుంబ సర్వే అధారంగా ముందుకు వెళ్లింది. సర్పంచ్, ఎంపీటీసీ పదవులకు బీసీ రిజర్వేషన్లను నిర్ధారించడానికి మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తూ..పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ వార్డులు యూనిట్‌గా నిర్ధారించినట్లు సమాచారం. మండల పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభాకు అనుపాతంలో సీట్లు కేటాయించిన తర్వాత, మిగిలిన సీట్లను మొత్తం 50% రిజర్వేషన్ పరిమితికి లోబడి స్థానిక బీసీ జనాభా ఆధారంగా కేటాయించేలా సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. కాగా.. మున్సిపల్ ఛైర్‌పర్సన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు రాష్ట్రాన్ని యూనిట్‌గా పరిగణలోకితీస ుకోనున్నారు. కమిషన్ సమర్పించిన నివేదిక పరిశీలీలన పై ఒక మంత్రివర్గ ఉప-సంఘాన్ని ఏర్పాటు చేసి.. వారు సిఫార్సులను ఆమోదించిన తర్వాత ఆ నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలుపుతుంది. ఆ తదుపరి ప్రభుత్వం ఈ ప్రతిపాదనను శాసనసభలో ప్రవేశపెట్టే విధంగా కసరత్తు జరుగుతోంది.

# శ్రీశైలం వచ్చే భక్తులకు బిగ్ అలర్ట్ ..!!

ఆంధ్రప్రదేశ్, ఆగస్టు 14: శ్రీశైల క్షేత్రంలో శ్రావణమాసోత్సవాలు ఆరంభం అయ్యాయి. ఈ రోజు (ఆగస్టు 13) నుంచి సెప్టెంబర్ 12 వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ పవిత్ర మాసంలో భక్తుల రద్దీ విపరీతంగా ఉండే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు ఆర్జిత సేవల్లో కొన్ని కీలక మార్పులు చేసారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆర్జిత సేవల విషయంలో మార్పుల పైన స్పష్టత ఇచ్చారు. శ్రీశైలం ఆలయంలో నేటి నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆర్జిత సేవల్లో పలు మార్పులు చేసింది. మంగళవారం నుంచి శుక్రవారం వరకు సామూహిక, గర్భాలయ అభిషేకాలు, కుంకుమా ర్చనలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. భక్తులు స్వామివారి దర్శనం మరియు పూజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాగా.. శని, ఆది, సోమవారాల్లో ఈ సేవలను పూర్తిగా రద్దు చేశారు. ఈ మూడు రోజుల్లో కేవలం రాత్రి వేళల్లో మాత్రమే పరిమితంగా స్పర్శ దర్శనాలకు అనుమతి ఇస్తారు. ఉత్సవాల సందర్భంగా క్యూలైన్లలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే, శ్రావణ మాసంలోని 2, 3, 4వ శుక్రవారాల్లో భక్తుల కోసం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నారు. మహిళలు ఈ వేడుకలలో పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావచ్చు అని ఆలయ వర్గాలు వెల్లడించాయి. అయితే ఆగస్టు 18, సెప్టెంబర్ 1 మరియు 8 తేదీలలో



ఉదయం వేళల్లో గర్భాలయ అభిషేకాలు నిర్వహించబడవని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. కాగా, దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. ఈ నెలలో సెలవులు ఎక్కువగా ఉండటంతో.. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని.. రద్దీకి అనుగుణంగా చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు.

# బోండా ఉమకు పేర్ని నాని సవాల్ .. ఆ రూ 50 కోట్లు...!!

విజయవాడ, ఆగస్టు 14: విజయవాడ కేంద్రంగా రాజకీయం వేడెక్కుతోంది. వైసీపీ- టీడీపీ నేతల సవాళ్లు.. ప్రతి సవాళ్లతో కొత్త సమీకరణాలు తెర మీదకు వస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల వేళ నేతలు తమ కేడర్ ను సమాయత్తం చేస్తున్నారు. కూటమి - వైసీపీ మధ్య హోరా హోరీ రాజకీయం కొనసాగుతోంది. ఇదే సమయంలో టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా లక్ష్యంగా వైసీపీ నేత పేర్ని నాని కీలక వ్యాఖ్యలు చేసారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పైన ప్రశ్నించారు. తన పైన వ్యాఖ్యలు చేసిన బోండా ఉమాకు పేర్ని నాని సవాల్ చేసారు. వైసీపీ ముఖ్య నేత.. మాజీ మంత్రి పేర్ని నాని రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని మండిపడ్డారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, టీడీపీ నేతల తప్పుడు ఆరోపణలపై మండిపడ్డారు. రాజమండ్రిలో మహిళా డాక్టర్‌ను వెన్నుపోటు పార్టీ కార్యకర్తలు దారుణంగా చంపేసినా, గంజాయి బ్యాచ్ పోలీసులపైనే దాడులకు తెగబడుతున్నా పట్టించుకోవ టం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. అమరావతి పేరుతో ప్రమోషన్ల హడావుడి చేస్తూ రైతుల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారే తప్ప, సాగునీరు లేక అల్లాడుతున్న కృష్ణా డెల్టా రైతుల కష్టాలు ఈ ప్రభుత్వానికి పట్టడంలేదని విమర్శించారు. ఇక తనపై, తన కుటుంబంపై టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమ చేసిన రూ. 50 కోట్ల ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తాము ఆ డబ్బు ఇచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ గానీ, కనీసం ఒక్క ఫోటో గానీ ఉంటే బయటపెట్టాలని, దమ్ముంటే ఈడీతో కేసు పెట్టి తమను జైలుకు పంపాలని నేరుగా సవాల్ విసిరారు. రాజమండ్రిలో ఓ మహిళా డాక్టర్‌ను ఇద్దరు తాగుబోతు టీడీపీ కార్యకర్తలు కారుతో గుద్ది, తొక్కించి దారుణంగా చంపేస్తే.. పోలీసులు దాన్ని ఓ యాక్సిడెంట్ కేసుగా నీరుగార్చారని పేర్ని నాని తీవ్ర వ్యాఖ్యలు చేసారు. మహిళలకు రక్షణ కల్పించే దిశా చట్టాన్ని ఎత్తేశారని చెప్పుకొచ్చారు. ఇంత దారుణాలు జరుగుతుంటే హోంమంత్రి అనిత ఏమయ్యారని ప్రశ్నించారు. ఆ బాధిత కుటుంబం దగ్గరకు





వెళ్లారా అంటూ నిలదీసారు. ఇక ఆడపిల్లల రక్షణపై వందల మీటింగుల్లో ప్రగల్భాలు పలికిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు కేవలం ట్వీట్లు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఇదే సమయంలో బోండా ఉమా చేసిన ఆరోపణల పైన స్పందించారు. తాను, తన సతీమణి వెళ్లి ఎవడో 'మావయ్య' కాళ్ల మీద పడి రూ. 50 కోట్లు కట్టామని చెబుతున్నారని.. ఆ మావయ్య చంద్రబాబు అయినా, లోకేష్ అయినా ఇంకెవరైనా సరే.. తాము ఆ మావయ్య ఇంటికి వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ గానీ, ఒక్క ఫోటో గానీ ఉంటే బయటపెట్టాలని... దమ్ముంటే ఈడీతో కేసు పెట్టించి తనను ఆ రూ. 50 కోట్లు తీసుకున్న మీ మావయ్యను ఇద్దరినీ జైల్లో వేయాలని పేర్ని నాని సవాల్ చేసారు.

# వ్యూహం మార్చిన వైసీపీ..

ఆంధ్రప్రదేశ్, ఆగస్టు 14: ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా పంచదార్ల కొండపై వైసీపీ తన పోరాటాన్ని తీవ్రతరం చేసింది. అక్కడ జరుగుతున్న మైనింగ్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, వారసత్వ సంపద నాశనమవుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యసభలో ఖనిజాల చట్ట సవరణ బిల్లు-2026పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. పంచదార్లలోని పురాతన ప్రదేశాలను, సహజ జలాశయాలను పరిరక్షించేందుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంచదార్లలో ఉన్న సంరక్షిత బౌద్ధ క్షేత్రం, పురాతన ధర్మలింగేశ్వర స్వామి ఆలయానికి అత్యంత సమీపంలో మైనింగ్ కార్యకలాపాలు సాగుతున్నాయని వైవీ సుబ్బారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఆలయ సముదాయం గుండా ప్రవహించే ఐదు సహజ జలాశయాలతోనే పంచదార్లకు ఆ పేరు, గుర్తింపు ముడిపడి ఉన్నాయని వివరించారు. రక్షిత ప్రాంతాల వద్దకు మైనింగ్ పొంచి రావడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ పర్యావరణానికి జరుగుతున్న హానిని పరిశీలించేందుకు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని, నీటి కాల్వలపై హైడ్రోలాజికల్ అధ్యయనం జరిపించాలని కోరారు. ఆ అధ్యయనం పూర్తయ్యే వరకు అక్కడ ఎలాంటి మైనింగ్ జరగకుండా తక్షణమే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఖనిజాల చట్ట సవరణ బిల్లుపై మాట్లాడుతూ.. ఖనిజ సంపద ప్రజల ఆస్తి అని, దాని నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వృద్ధికి స్పష్టమైన మైనింగ్ విధానం అవసరమే అయినప్పటికీ, అది రాష్ట్రాల ఆదాయాలకు, స్థానిక ప్రజల జీవనోపాధికి లేదా పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగించకూడదని హితవు పలికారు. మైనింగ్ వల్ల తలెత్తే పర్యావరణ, మౌలిక సదుపాయాల వ్యయ భారాన్ని రాష్ట్రాలే మోస్తాయని, అందుకే మైనింగ్ విధానాల రూపకల్పనలో రాష్ట్రాల ప్రయోజనాలు, ఆదాయాలను కాపాడేలా నిర్ణయాలు ఉండాలని స్పష్టం చేశారు.

# "బద్లావ్ జరూరీ హై - దేశ్ కో బచావో, మోడీ హటావో" నినాదంతో 19న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

అనంతపురం, ఆగస్టు 13 అనంత సూర్య : సీపీఐ జాతీయ, రాష్ట్ర సమితులు, అనుబంధ ప్రజా సంఘాల పిలుపు మేరకు "బద్లావ్ జరూరీ హై - – దేశ్ కో బచావో, మోడీ హటావో" నినాదంతో ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార గోడపత్రికను అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీ. సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా మరింత పెంచుతున్నాయని విమర్శించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని పాలకులు చెబుతున్నప్పటికీ, నేడు యువత చేతుల్లో ఉద్యోగ నియామక పత్రాల కంటే ఉద్యోగ దరఖాస్తులు, హాల్‌టికెట్లు, కోచింగ్ ఫీజు రసీదులు, విద్యా రుణాల పత్రాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను సంవత్సరాల తరబడి నిరీక్షణలో ఉంచుతున్నారని విమర్శించారు. పోటీ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీకులు, ఫలితాల జాప్యం, నియామక ప్రక్రియలో అవకతవకల కారణంగా యువత తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఉద్యోగం కోసం సిద్ధమవుతూ వయోపరిమితి దాటిపోతున్న పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం



తక్షణమే అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేస్తోందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగాలు కల్పించలేని పక్షంలో నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేసి పూర్తిస్థాయి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కోచింగ్ కోసం అప్పులు చేసి, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోస్తూ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతను నోటిఫికేషన్ల జాప్యం, పరీక్షల వాయిదాలు, ఫలితాల ఆలస్యం తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 11,639 పోలీస్ శాఖ పోస్టులకు, ఇందులో ఎస్ఐ, కానిస్టేబుల్, హోంగార్డ్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ నియామకాల్లో గరిష్ట వయో పరిమితిని 38 సంవత్సరాలకు పెంచి, నిరుద్యోగ యువతకు వయో సడలింపు కల్పించాలని కోరారు. 2025 మెగా డీఎస్సీ నియామకాల్లో ప్రశ్నపత్రాల లీకేజీ, మెరిట్ జాబితాల్లో అక్రమాలు, స్పోర్ట్స్ కోటా దుర్వినియోగంపై హైకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకులు, నియామక అవకతవకలను అరికట్టి పారదర్శక నియామక వ్యవస్థను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. ఎమ్మెస్ ఎంఈ రంగానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించి స్థానిక యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని, వెనుకబడిన ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి యువత వలసలను అరికట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. దేశ యువతకు ఉపాధి హక్కును చట్టబద్ధంగా కల్పించి, ఉద్యోగం కోరుకునే ప్రతి యువకుడికి ప్రభుత్వం బాధ్యత వహించే విధంగా విధానాలను రూపొందించాలని కోరారు. ఈ సంద్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. దేశ యువత భవిష్యత్తును కాపాడేందుకు నిర్వహిస్తున్న ఈ పోరాటంలో నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో భాగసావ్యములు కావాలని ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా జరిగే నిరసనలను విజయవంతం చేయడంతో పాటు, సెప్టెంబర్ 1న నిర్వహించే "చలో ఢిల్లీ" కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.ధనుంజయ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కావాలి కొట్రేస్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్ర నగర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద కుమార్, రియాజ్, బండారు తేజ, బి కే ఎస్ మండల కార్యదర్శి బండారు లోకేష్, రాయదుర్గం అధ్యక్షులు కుమార్ నాయక్, అశోక్,యువతేజ ,వంశీ ప్రసతదితరులు పాల్గొన్నారు.


# పీవీకేకేలో ఘనంగా ఓరియంటేషన్



అనంతపురం, ఆగస్టు 13 అనంత సూర్య: పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురంలో 2026--27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ (పరిచయ కార్యక్రమం) గురువారం ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు కళాశాల విద్యా విధానం, క్రమశిక్షణ, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవకాశాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతిక విద్యలో క్రమశిక్షణతో కూడిన ప్రామాణిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, అవసరమైన సౌకర్యాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తును సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ డా. కిషోర్ పల్లె మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కళాశాల ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డా. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు బీటెక్ విద్యను కేవలం డిగ్రీగా కాకుండా తమ భవిష్యత్‌కు బలమైన పునాదిగా భావించాలని సూచించారు. మొదటి సంవత్సరం నుంచే సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల యాజమాన్యం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, డీన్ డా. సంతోష్ కుమార్ రెడ్డి, ఏవో డా. మనోహర్ రెడ్డి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డా. లక్ష్మీనరసప్ప, అధ్యాపకులు, సిబ్బంది, 2026--27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన నూతన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం ఆగస్టు 13 అనంత సూర్య : అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఒక అద్భుతం అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆమె బుధవారం స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే చదివిన నేపథ్యంలో యూనివర్శిటీ విశేషాలను ఎమ్మెల్యే సునీత పంచుకున్నారు. మీరు ఎంబిఏ చదివిన, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలలో ఒకటిగా ఉన్న అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించానని.. ఈ ఫోటోలను తమకి పంపుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉన్న ఈ యూనివర్సిటీలో మీరు చదవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా స్టాన్‌ఫోర్డ్ ఎంబిఏ ప్రోగ్రామ్, ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అగ్రశ్రేణిలో కొనసాగుతోందని తెలుసుకున్నానన్నారు. ఇక్కడ సీటు సాధించడం అత్యంత కఠినమైన విషయమని.. అలాంటిది మీరు ఇక్కడ చదవడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే ప్రపంచాన్ని శాసిస్తున్న అనేక దిగ్గజ కంపెనీల వ్యవస్థాపకులు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉన్నారని, దాదాపు 21 మందికి పైగా నోబెల్ బహుమతి గ్రహీతలు ఇక్కడ చదివిన వారు ఉన్నారని తెలుసుకున్నట్లు చెప్పారు. ఇంత గొప్ప యూనివర్సిటీలో చదువుకున్నారు కాబట్టే.. మీరు రాష్ట్రానికి ఇలా అత్యుత్తమ సేవలు అందించగలుగుతున్నారన్నారు. ఈరోజు రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావడం, విద్యాశాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకొస్తున్నారంటే ఇక్కడ మీరు పొందిన విజ్ఞానం అని అర్థమవుతోందన్నారు. ఇలాంటి యూనివర్సిటీలో మీరు చదివినందుకు, అలాగే మీరు మన రాష్ట్ర మంత్రి అయినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. అయితే రాయలసీమ ప్రాంతంలో ఎస్కేయూనివర్శిటీ, జేఎన్టీయూలు తప్ప పెద్దగా చెప్పుకోదగ్గ యూనివర్శిటీలు లేవని.. మీరు ప్రత్యేకంగా చొరవ చూపి స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థల్ని నెలకొల్పాలని మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.



# సర్వే పనులు వేగవంతం చేయాలి

కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



అనంతపురం, ఆగస్టు 13 ( అనంత సూర్య:): రీ-సర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో 6వ దశ కింద చేపట్టిన రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వేకు సంబంధించి రైతులకు ముందుగా నోటీసులు అందాయా లేదా అని రైతులను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సర్వే ఎంతవరకు జరుగుతుందనే వివరాలను ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ (గ్రౌండ్ ట్రూథింగ్ ) ప్రక్రియ జరుగుతోండగా, మొత్తం 10,000 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2,700 ఎకరాలలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీ లక్ష్యాలను మించి పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనకప్రసాద్, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల తహసిల్దార్ ఆంజనేయ ప్రసాద్, ఆర్ఎస్‌డిటి, మండల సర్వేయర్, విఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్ లో పనితీరుపై సమీక్ష



అనంత కలెక్టరేట్, ఆగస్టు 13:( అనంత సూర్య:): సమీక్షకు హాజరైన డిఆర్డీఏ పిడి శైలజ, సెర్ప్ స్టేట్ ఆఫీసు పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ హనుమ నాయక్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, తదితరులు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో గురువారం జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్ కు సంబంధించి క్షేత్రస్థాయి పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించగా, ఈ సమీక్ష సమావేశానికి డిఆర్డీఏ పిడి శైలజ, సెర్ప్ స్టేట్ ఆఫీసు నుంచి పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ హనుమ నాయక్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, తదితరులు హాజరయ్యారు. పెన్షన్ పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్బ్యాక్ కు సంబంధించి విశ్లేషణ మరియు ప్రగతి మెరుగుపరచడం మరియు పనితీరుపై సమీక్ష నిర్వహించి, సంబంధిత అంశాలపై అవసరమైన సూచనలు మరియు ఆదేశాలను డిఆర్డీఏ పిడి, సెర్ప్ స్టేట్ ఆఫీసు పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ ఇవ్వడం జరిగింది. జిల్లాలో పెన్షన్స్ పంపిణీ మరింత మెరుగ్గా చేపట్టాలని వారు ఆదేశించారు. ఈ సమావేశంలో పెన్షన్స్ హెచ్.డి డిపిఎం ఎన్.రవీంద్ర బాబు, పెన్షన్స్ ఏపీవో అజంతుల్లా, డిప్యూటీ ఎంపీడీవోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పెన్షన్ పంపిణీ అధికారులు, డిఆర్డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరోనాని అడ్డం పెట్టుకుని నిధులు కాజేశారు

- వైసీపీపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు
- శ్రీనగర్ కాలనీ శివారులో రూ.కోటి అభివృద్ధి పనులకు భూమి పూజ
- 20-25ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం
- శ్రీనగర్ కాలనీ 2వ జూబ్లీహిల్స్ గా మారిందన్న దగ్గుపాటి



అనంతపురం, ఆగస్టు 13 అనంత సూర్య : కరోనాని అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదించుకున్న చరిత్ర వైసీపీ వారిదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. నగరంలోని శ్రీనగర్ కాలనీ శివారులో కోటి రూపాయిలతో అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. 15ఫైనాన్స్ కార్పొరేషన్ కింద రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల్ని టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్ల గొడ్డలిపార్టీ పాలనలో నగరంలో ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. చివరకు కరోనాను కూడా వాడుకుని మున్సిపాల్టీలో నిధులు తిన్నారన్నారు. ఈరోజు 10-15ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్డు వేస్తున్నామన్నారు. 20-25ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నామని దగ్గుపాటి అన్నారు. కేవలం రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక వసతులకే 200కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. శ్రీనగర్ కాలనీ 2వ జూబ్లీహిల్స్ గా మారిందని.. ఇక్కడ అభివృద్ధి జరిగింది కాబట్టే నగరంలోనే కాస్ట్లీ కాలనీగా గుర్తింపు వచ్చిందన్నారు. నగరంలో భూముల విలువ పెరిగిందని.. ఇదంతా రెండేళ్లలో జరిగిన అభివృద్ధి వలనే సాధ్యమైందన్నారు. వైసీపీ హయాంలో పెట్టి పోయిన మూడున్నర లక్షల టన్నుల చెత్తను తొలగిస్తున్నామన్నారు. డంపింగ్ యార్డ్ లో ఉన్న చెత్తను మరో మూడు నెలల్లో పూర్తి స్థాయిలో తొలగిస్తామన్నారు. ఇక్కడ పార్కుతో పాటు ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

# మెడికల్ అడ్మిషన్లలో బీసీలకు ద్రోహం చేసే జీవో నెం.102 ను తక్షణమే రద్దు చేయాలి

అనంతపురం, ఆగస్టు 13 అనంత సూర్య: కడప నగరంలోని బీసీ భవనంలో బిసివై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కడప జిల్లా నూతన కమిటీని బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా కన్వీనర్ రామ్ చరణ్, జిల్లా కో కన్వీనర్ గా యోగానందలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని జిల్లాలోనూ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు



దోపిడీని అరికట్టాలనీ, విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలనీ, సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలనీ, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని వారు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని, ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మాత్రం.. ఈ సమస్యలపై సమీక్ష ఏర్పాటు చేయకుండా సమస్యలను గాలికి వదిలేసాడని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నారా లోకేష్ కి హెచ్చరించారు. విద్య రంగ సమస్యలు పరిష్కరించని ఎడల బీసీవై పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని వారు కూటమి ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వేణు, వెంకటరమణ, యూత్ కన్వీనర్ నాగార్జున యాదవ్ వెంకటేశ్వర్లు, పెంచలయ్య, వినోదు, మోక్షిత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి గురవుతున్న ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు

## రెండు నెలల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలి లేకుంటే ఉద్యమం తప్పదు

**- ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు బుగత అశోక్ ఆగ్రహం**



విజయనగరం, అనంత సూర్య: ప్రతినిధి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం విజయనగరం సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) లో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులు, ఘోషా ఆసుపత్రి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఏరియా ఆసుపత్రులు మరియు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సిహెచ్‌సి) పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి బకాయిలు చెల్లించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు మరియు సూపర్‌వైజర్లకు పెండింగ్‌లో ఉన్న గత రెండు నెలల జీతాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# పీపీపీ మోడల్లో మున్సిపల్ షాపుల అభివృద్ధిపై ప్రణాళికలు

## నగరపాలక సంస్థ ఆదాయం పెంచే విధంగా ఎమ్మెల్యే దగ్గుపాటి చొరవ

అనంతపురం, ఆగస్టు 13 అనంత సూర్య: అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో శిథిలావస్థ, వృథాగా ఉన్న మున్సిపల్ షాపులను పీపీపీ మోడల్లో అభివృద్ధి చేసే విధంగా ఎమ్మెల్యే దగ్గుపాటి చొరవ చూపుతున్నారు. అలాగే నగరంలో రోడ్లు, ప్రభుత్వ భవనాల పటిష్టతపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్, ఆర్.అండ్.బి అధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. రెండు శాఖలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, టీపీఓతో కలిసి పలు కీలక అంశాల గురించి చర్చించారు. నగరంలో డివిజన్ల వారీగా పెండింగ్, చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పై గురించి ఆరా తీశారు. ఓల్డ్ టౌన్ లోని పాత మున్సిపల్ షాపుల తొలగించి.. కొత్త షాపింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ అభివృద్ధి అవకాశాల గురించి చర్చించారు. పీపీపీ మోడల్లో వాటిని అభివృద్ధి చేస్తే.. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం, లీజుదారుల ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్, సాధ్యసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. మున్సిపల్ షాపుల అద్దెలు, బకాయిల వసూళ్లు క్రమం తప్పకుండా చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్సులు, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. నగరంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరగాలని.. శానిటేషన్ సిబ్బంది ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండేలా చూడాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ అనుమతులు, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, అక్రమ నిర్మాణాలపై చర్యలు, రోడ్డు ఆక్రమణల తొలగింపుపై కూడా చర్చించారు.



నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని, పైప్ లైన్ లీకేజీలు, మరమ్మత్తులు, నీటి ట్యాంకుల నిర్వహణ వంటివి చూసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ వచ్చిన ఫిర్యాదులకు కచ్చితమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. మరోవైపు ఆర్ అండ్ బి అధికారులతో జరిగిన సమీక్షలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల పరిస్థితి, గుంతలు, దెబ్బతిన్న రోడ్ల వంటి గురించి ఆరా తీశారు. అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్లను గుర్తించాలన్నారు. ప్యాచ్ వర్కులు, బీటీ రోడ్లు, సీసీ రోడ్ల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలపై తనిఖీలు, కాంట్రాక్టర్ల పనితీరుపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. అనంతపురం నగరానికి అనుసంధానమయ్యే ప్రధాన రోడ్ల అభివృద్ధి, ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాల గుర్తించి.. రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ సమస్యల పరిష్కారించాలని ఆదేశించారు. ఎక్కడా దెబ్బతిన్న రోడ్లు కనిపించకూడదన్నారు. ఆర్.అండ్.బి పరిధిలోని ప్రభుత్వ భవనాల ప్రస్తుత పరిస్థితి, మరమ్మతులు అవసరమైన భవనాల జాబితా, కొత్త ప్రభుత్వ భవనాల అవసరం గురించి కూడా చర్చించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన వాటిని గుర్తించి నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు.

# ఉచిత కృత్రిమ చేతుల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా ఎస్పీ



విజయనగరం, అనంత సూర్య: ప్రతినిధి: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా చేపట్టే 'ఎల్ఎన్4' కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ కోరారు. ఆగస్టు 16న ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఈ పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ--- ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా చేతులు కోల్పోయిన వారికి ఆధునిక కృత్రిమ అవయవాలు అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, స్వయం సమృద్ధి పెరుగుతాయని తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం మరియు అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. అర్హులైన వారు ముందుగా విజయనగరంలోని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు సమాజంలో ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిస్తూ, ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డాక్టర్ రవి వడ్లమాని, రవి కె. మండలను ఎస్పీ అభినందించారు. ముందస్తు రిజిస్ట్రేషన్ కోసం: 8866306969
సందేహాల నివృత్తి కోసం: 9182615056

# పుట్టపర్తిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా" ర్యాలీ

## పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి,ఆగస్టు,13:( అనంత సూర్య:) : దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సార్వభౌమత్వం పట్ల ప్రజల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ర్యాలీలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ఆర్డీఓ సువర్ణ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజా బేగం , ఐసిడిఎస్ పిడి ప్రమీల,డిఆర్‌డిఎ పిడి నరసయ్య తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభం నుంచి ముగింపు వరకు దేశభక్తి, జాతీయ భావం ఉట్టిపడేలా సాగింది. చిన్నారులు, విద్యార్థులు చేతుల్లో జాతీయ పతాకాలను పట్టుకుని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ మధ్యలో విద్యార్థులు, చిన్నారులు "వందే మాతరం", "భారత్ మాతాకీ జై" వంటి దేశభక్తి నినాదాలతో పుట్టపర్తి ప్రధాన వీధులను మార్మోగించారు. వారి ఉత్సాహం,



దేశభక్తి ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరిలోనూ జాతీయ స్ఫూర్తిని నింపింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయడంతో పాటు, జాతీయ జెండా పట్ల గౌరవం, జాతీయ ఐక్యత, దేశ సమగ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ర్యాలీ ముగిసిన అనంతరం పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు మరియు ఇతరులు కలిసి "హర్ ఘర్ తిరంగా" ప్రతిజ్ఞను స్వీకరించారు. జాతీయ పతాక గౌరవాన్ని కాపాడుతూ, దేశ ఐక్యత మరియు సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా "ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం -- ప్రతి హృదయంలో దేశభక్తి" అనే సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అధికారులు, విద్యార్థులు, చిన్నారులు సమన్వయంతో నిర్వహించిన ఈ ర్యాలీ పుట్టపర్తిలో దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచింది.

# వికసిత్ భారత్ - జీ రామ్ జీపై ప్రజాప్రతినిధులకు శిక్షణ



విజయనగరం, అనంత సూర్య: ప్రతినిధి: స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు 'పంచ సమ్మేళన్ -- వికసిత్ భారత్--జీ రామ్ జీ' పథకం ప్రాధాన్యత, అమలు విధానంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, డ్వామా పథక సంచాలకులు ఎస్. శారదాదేవి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామీణ ప్రాంతాలను స్వయం సమృద్ధి, పారదర్శకత కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో అర్హులైన గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల వేతన ఉపాధి కల్పించడంతో పాటు శాశ్వత ఆస్తుల నిర్మాణం, ప్రకృతి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. 18 ఏళ్లు పైబడిన వారు నైపుణ్యం లేని పనుల కోసం నమోదు చేసుకోవచ్చని, ఈ రోజ్గార్ గ్యారంటీ కార్డు మూడేళ్ల పాటు చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలు, మండల, జిల్లా పరిషత్‌ల పాత్రను ప్రతినిధులకు వివరించారు. నీటి వనరులు, మౌలిక సదుపాయాలు, జీవనోపాధి మరియు విపత్తు నివారణ పనులను ఈ పథకం కింద చేపడతారని తెలిపారు. పనుల అమలులో పారదర్శకత కోసం సామాజిక తనిఖీలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎ. లవరాజు, సహాయ పథక సంచాలకులు కె. రమామణి, అదనపు కార్యక్రమాధికారి ఆర్. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405